క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 8న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్, టేకులగూడెం, రాంపూర్ సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, కాజీపేట రహమత్‌నగర్, జూబ్లీమార్కెట్, వెంకటాద్రి నగర్, సోమిడి, కాజీపేట మెయిన్‌రోడ్, రైల్వేస్టేషన్ ఏరియా, డీమార్ట్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 8న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఏనుమాముల, ఆజాంజాహిమిల్, కరీమాబాద్, ఖిలావరంగల్ సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో, కాశిబుగ్గ నుంచి పోచమ్మమైదాన్ రోడ్, గోవిందరాజుల గుట్ట, లక్ష్మీపూర్ కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

హసన్‌పర్తి : మండలంలోని మల్లారెడ్డిపల్లి, ఎల్లాపురం, దేవన్నపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ సామ్యానాయక్ తెలిపారు. సబ్‌స్టేషన్ల మరమ్మతు దృష్ట్యా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు.

18న చలో రైల్‌నిలయం

కాజీపేట రూరల్ : రైల్వే కార్మికుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారానికి రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న చలో రైల్ నిలయం కార్యక్రమం చేపట్టినట్లు శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ తెలిపారు. కార్యక్రమానికి సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్ల నుంచి సుమారు 1000 మంది రైల్వే కార్మికులు తరలిరానున్నట్లు తెలిపారు. మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్, డివిజన్, కాజీపేట సబ్ డివిజన్ పరిధి బ్రాంచీల నాయకులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

నల్లగొండకు తరలిన టీచర్లు



విద్యారణ్యపురి: వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డి పోటీ చేస్తున్నారు. శుక్రవారం ఆయన నల్గొండలో నామినేషన్ వేస్తుండటంతో హనుమకొండ, వరంగల్ జిల్లాకేంద్రాల నుంచి టీపీటీఎఫ్, టీఎస్ యూటీఎఫ్ బాధ్యులు, ఉపాధ్యాయులు బస్సులో తరలివెళ్లారు. తరలిన వారిలో టీపీటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు, గొడిశాల సత్యనారాయణ, లక్ష్మయ్య, శ్రీ రామ్, సిహెచ్.రవీందర్‌రాజు, పెండెం రాజు, కుమార్, సుజన్ ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షులు అజ్మీరా రాజారాం తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా



నయీంనగర్ : ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తానని టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి, తెలంగాణ జనసమితి నల్గొండ జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత హెడ్‌మాస్టర్ పన్నాల గోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో గెలిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు ఉపాధ్యాయుల సమస్యలను గాలికి వదిలేసారని తాను గెలిస్తే వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాగేశ్వర్ యాదవ్, కట్ల జగన్నాథం గౌడ్, పెద్దయ్య, సుధాకర్, యాదగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే వరల్డ్ రికార్డు ప్రాజెక్టుకు ఉద్యోగి ఎంపిక



దేవయ్య

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న, కరాటే బ్లాక్‌బెల్టు ఫిఫ్త్ డాన్ పి.దేవయ్య చెన్నైలో నేడు (శనివారం) జరిగే వరల్డ్ కరాటే మాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే వరల్డ్ రికార్డు–2025 ప్రాజెక్టుకు ఎంపికయ్యాడు. 10 వేల మంది పాల్గొంటున్న వరల్డ్ రికార్డు ప్రాజెక్టుకు తాను ఎంపికై పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉందని శుక్రవారం దేవయ్య తెలిపారు.

ఆర్థికసాయం

వరంగల్ : నగరంలోని రామన్నపేటకు చెందిన బీరవెల్లి రాజేష్(35) ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. రాజేష్ కుటుంబాన్ని పరామర్శించిన ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గుండా ప్రకాష్‌రావు ఆర్యవైశ్య సంఘం తరపున అంత్యక్రియలకు రూ.4వేలు ఆర్థికసాయం అందించారు.

భద్రతలేని ఆటో ప్రయాణం..!

- పరిమితికి మించి లోడు..
- ప్రయాణానికి జంకుతున్న ప్రజలు
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న డ్రైవర్లు



రహదారిపై ఓవర్‌లోడుతో వెళ్తున్న ఆటో

ఖిలా వరంగల్: ఆటో ప్రమాదాలు జరగడం సాధారణంగా మారింది. అతివేగం, అనుభం లేమి కావచ్చు. మూలమలుపు.. సెల్‌ఫోన్ సంభాషణలు ఏదేమైనా నిండు ప్రాణాల రక్షణకు పోలీసులు, ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పిస్తున్నా పూర్తిస్థాయిలో నియంత్రించాల్సి ఉంది. పలువురు నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై దృష్టి సారించాలని గ్రామీణ, నగర ప్రజలు కోరుతున్నారు.

వరంగల్ నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఆటోల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేక, ఉన్నచోట సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రయాణికుల ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. ఒకే ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. ప్రమాదం అని తెలిసిన కూడా పల్లె ప్రాంతాల్లో సరైన బస్సు సౌకర్యాలు లేక పరిమితికి మించి అధిక లోడుతో గమ్యానికి 10 నుంచి 14 మందిని చేరవేస్తున్నారు. దీంతో జాతీయ రహదారులపై ప్రయాణికుల ఆటోల నిషేదం ఉన్నా..రాకపోకలు సాగిస్తూ ఆటోలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. ప్రధానంగా వరంగల్ పోస్టాఫీసు జంక్షన్, వరంగల్ అండర్ బ్రిడ్జి నుంచి విలీన గ్రామాలు ప్రజలు ఎక్కువగా ఆటోల్లోనే ప్రయాణిస్తున్నారు. నగరంలో నైతే ఆటో వెనుక ఆటో.. పదుల సంఖ్యలో ప్రయాణికులను చేరవేస్తున్నాయి. చేయి చూపగానే వెనుక వచ్చే వాహనాన్ని డ్రైవర్ పట్టించుకోకుండా పక్కన పెట్టి ఆటోలు నడిపిస్తున్నారు.

భయం భయంగా ప్రయాణం..

ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ఆటో ఎక్కింది మొదలు గమ్యస్థానాలకు వెళ్లే వరకు ప్రయాణికుల ప్రాణాలను అరచేతిలో పెట్టువాల్సిన పరిస్థితి తలెత్తిందని పలువురు అంటున్నారు. కనీసం మలుపుల వద్ద సిగ్నల్స్ కూడా ఇవ్వడం లేదు. సెల్‌ఫోన్లో సంభాషిస్తూ, ఆటోలో అమర్చుకున్న డెక్కులు, రికార్డుల్లో పాటలు వింటూ పలు డ్రైవర్లు వాహనాన్ని నడుపుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకుంటున్నా..

ఆటో ప్రమాదాలను నివారణకు పోలీసులు, ఆర్టీఏ అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నా పలువురు ఆటో వాలాలు వ్యవహార శైలి మాత్రం మారడం లేదు. అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు కౌన్సెలింగ్ ఇవ్వడం, సమావేశాలు నిర్వహించడం, ఆ తర్వాత హితబోధన చేస్తున్నా డ్రైవర్లు మాత్రం అవేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

కేసులను నమోదు చేస్తున్నాం



నిబంధనలు అనుసరించే ప్రయాణికులను ఎక్కించాలి. జాతీయ రహదారులపై ఆటోలకు అనుమతుల్లేవు. గ్రామీణ, నగర అంతర్గత రహదారులపై ఆటోలను నడిపించాలి. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించే ఆటోలపై కేసులు నమోదు చేస్తున్నాం. – జయపాల్‌రెడ్డి, ఎంవీఐ, వరంగల్

ధర రాక నిండా మునుగుతున్న రైతులు

- మిర్చికి కనీస మద్దతు ధర రూ.25 వేలు ప్రకటించాలి
- ఏఐకేఎఫ్, తెలంగాణ రైతు సంఘాల నాయకులు



మార్కెట్‌లో మిర్చి బస్తాల తూకాలను పరిశీలిస్తున్న రైతు సంఘాల నాయకులు

వరంగల్ : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను మార్కెట్ మాయాజాలంలో దోపిడీ చేస్తూ నిండా ముంచుతున్నారని వ్యాపారుల కబంధ హస్తాల్లో మార్కెట్లు నడుస్తున్నాయని వారికి మార్కెట్ అధికారులు అండగా నిలుస్తున్నారని అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకెఎఫ్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్‌లు అన్నారు. శుక్రవారం ఏఐకెఎఫ్, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి రైతుల పంటల కొనుగోలు పరిస్థితి, కనీస వసతులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏనుమాముల మార్కెట్ రైతుల పంటల దోపిడీకి అడ్డాగా మారిందన్నారు. వ్యాపారుల కనుసనల్లో మార్కెట్ వ్యవస్థ నడుస్తున్నదని వ్యాపారులందరు సిండికేట్ అయి వారి లాభాలను దృష్టిలో పెట్టుకొని అంతర్జాతీయంగా మిర్చి పంటకు డిమాండ్ ఉన్నప్పటికి మార్కెట్‌లో జెండా పేరిట క్వింటాకు రూ.13,400లు ధర నిర్ణయిస్తూ ఆచరణలో అమలు చేయకుండా కేవలం రూ.8 వేలకు మించి కొనుగోలు చేయడం లేదని, మోసం చేస్తున్న వ్యాపారులకు మార్కెటింగ్ అధికారులు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నూతన వ్యవసాయ మార్కెటింగ్ చట్టాన్ని అమలు చేస్తే రైతుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే మార్క్ ఫెడ్,నాఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేయించి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.25వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మార్కెట్ కార్యదర్శి పోలేపాక నిర్మలకు మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు ఎస్‌రెడ్డి హంసారెడ్డి, ఎండి.ఇస్మాయిల్, గోనె రామచందర్, ఓదెల రాజన్న, ఊరటి హంసల్ రెడ్డి, ఐతమ్ నాగేష్, జక్కుల అశోక్, అప్పనపురి నరసయ్య, మాలి ప్రభాకర్, పరిమళ గోవర్ధన్‌రాజు, ఊకంటి గోపాల్‌రెడ్డి, లడె మోహన్‌రావు, బొల్లు ఎల్లయ్య, రాములు, నరసయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం



మొక్క నాటుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని పలు సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం అన్నారు. నూతనంగా రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ చాంబర్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్, సైన్స్ విభాగాల అధిపతులు తమతమ వివిధ విభాగాల్లోని పలు సమస్యలను రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. డిపార్ట్‌మెంట్ కమిటీల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను కూడా చేర్చాలని కోరారు. ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి కళాశాలలో విద్యాబోధన, అలాగే ఉద్యోగుల కొరత తదితర అంశాలను రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంబీఏ కళాశాల ప్రాంగణంలో రామచంద్రం, ప్రిన్సిపాల్ జ్యోతితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం రిజిస్ట్రార్‌ను సన్మానించారు.

చట్టాలపై అవగాన పెంచుకోవాలి



ఖిలా వరంగల్ : మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యురాలు, న్యాయవాది గోపిక రాణి, జిల్లా వెల్ఫేర్ ఆఫీస్ కోఆర్డినేటర్ హర్షిత సూచించారు. బేటి బచావో.. బేటి పఢావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వరంగల్–ఖమ్మం హైవేపై వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలోని సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక అధ్యక్షతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ మహిళలు, యువతుల చట్టాలపై అవగాహన పెంచుకుంటే నేరాల సంఖ్య తగ్గుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సూచించారు.

కార్మిక భవనం కూల్చిన వారిపై చర్య తీసుకోవాలి

- కలెక్టర్‌కు అఖిలపక్ష నేతల ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏజేమిల్లు భూముల పరిరక్షణ జేఏసీ నాయకులు

వరంగల్: వరంగల్ అజంజాహి మిల్ కార్మికులకు చెందిన భవన స్థలాన్ని కబ్జా చేసిన పెద్దపల్లికి చెందిన నరేష్‌రెడ్డి, భవనాన్ని కూల్చివేసిన వ్యాపారిపై చర్య తీసుకోవాలని ఏజే మిల్లు భూముల పరిరక్షణ జేఏసీ కమిటీ నాయకులు కలెక్టర్ సత్యశారదను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్లుగా కార్మికుల పోరాటాలకు వేదికగా నిల్చిన కార్మిక భవనానికి మున్సిపాలిటీ ఇంటి నంబర్ కలిగి ఉన్న నేపథ్యంలో 2016లో అప్పటి వరంగల్ తహసీల్దార్ తప్పుడు మార్గంలో మ్యుటేషన్ చేశారని తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఇంటినంబర్ కలిగి ఉన్నప్పుడు రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారం ఉండదని వినతిలో పేర్కొన్నారు. వెంటనే మ్యుటేషన్ చేసిన రికార్డులను రద్దు చేసి అందుకు బాధ్యులైన నరేష్‌రెడ్డితో పాటు సహకరించిన వరంగల్ తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, భవనాన్ని కూల్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కార్మికులకు భవనస్థలం దక్కేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జేఏసీ కన్వీనర్ గంగుల దయాకర్, డాక్టర్ కొంఙతం కృష్ణ, పెరుమాళ్ల లక్ష్మణ్, కొంపెల్లి ప్రవీణ్, జి. క్రాంతికుమార్, ఆకెన వెంకటేశ్వర్లు, గంజి సాంబయ్య, బిళ్ల శంకర్, తదితరులు ఉన్నారు.

సీఐ సీతారెడ్డి, సిబ్బందిని సస్పెండ్ చేయాలి

- బేడబుడిగ జంగం ఐక్యవేదిక డిమాండ్



ధర్నా చేస్తున్న బేడబుడగజంగం సంఘం నేతలు

వరంగల్ : దళిత న్యాయవాది గంధం శివపై అకారణంగా దాడి చేసి గాయపర్చిన హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి, ఎస్సైలు యుగేంధర్, పసియొద్దీన్, కానిస్టేబుల్ రమేష్, ఇతర కానిస్టేబుళ్లను తక్షణమే సస్పెండ్ చేయాలని బేడబుడిగ జంగం ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ పత్రి రాజపోషాలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏనుమాముల బాలాజీనగర్ సర్కిల్‌లో శివపై జరిగిన దాడిని నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఐ, ఇతర సిబ్బందిపై కేసు నమోదు చేసినప్పటికీ వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోకపోవటం బాధాకరమన్నారు. పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు దాడికి పాల్పడిన వారిని సస్పెండ్ చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా బేడ బుడగ జంగం నాయకులు పత్రి సుభాష్, యాడాల జగపతి, గంధం పరమేశ్వర్, సతీష్, మధు, లోకేష్, సారమ్మ, భాగ్యలక్ష్మి, భాగ్యమ్మ, సమ్మయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

కొత్త బ్రేకర్ చార్జ్ ఏర్పాటు

హసన్‌పర్తి : చింతగట్టు సబ్‌స్టేషన్‌లో శుక్రవారం కొత్తబ్రేకర్ చార్జ్ ఏర్పాటు చేశారు. ఈ చార్జ్‌తో భీమారం, ఎర్రగట్టు గుట్ట ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం నివారించవచ్చని డీఈఈ సామ్యానాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ అశోక్‌కుమార్, ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ నూతన కమిటీ



ఉమ్మడి జిల్లా నూతన కమిటీ సభ్యులు

కేయూ క్యాంపస్: వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఇంటర్నేషనల్ కమిటీ కార్యవర్గ సమావేశం శుక్రవారం కాకతీయ యూనివర్సిటీలో ఎకనామిక్స్ విభాగంలో నిర్వహించారు.ఈ సమావేశంలో సంస్థ చేపట్టబోయే పలు అంశాలపై చర్చించారు. సంస్థ బలోపేతానికి ఉమ్మడి వరంగల్ జిల్లాల ఆధ్వర్యంలో కమిటీలు వేయాలని సమావేశం నిర్ణయించింది. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా ఆచార్య రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా మండల పరశురాములు, మహిళా విభాగం అధ్యక్షులుగా సంయుక్త, ప్రధాన కార్యదర్శిగా పగడాల సరళను నియమిస్తూ ఆ సంస్థ చైర్మన్ మహ్మద్‌సిరాజుద్దీన్ ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆచార్య బి.సురేష్‌లాల్, బాధ్యులు విష్ణువర్ధన్, విజయబాబు, ఘంటా రామిరెడ్డి, పాన్నాల రాంమోహన్, కాజీపేట పురుషోత్తమ్, రాజ్‌కుమార్, శ్రీమన్నారాయణ, ఎర్రన్న పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజారెడ్డి

విద్యారణ్యపురి : జెన్‌పాక్ట్ కంపెనీ నిర్వహిస్తున్న ఉద్యోగా మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి కోరారు. శుక్రవారం కళాశాలలో తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్ వారు సంయుక్తంగా టాస్క్ ఆధ్వర్యంలో జెన్‌పాక్ట్ ఉద్యోగ మేళాను నిర్వహించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జెన్‌పాక్ట్ కంపెనీలో ఉద్యోగం రావడం చాలా అదృష్టమన్నారు. ఈ మేళాలో 150 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. జెన్‌పాక్ట్ వరంగల్ ప్రతినిధులు జస్టిన్ శ్యాంసన్, రామకురుషన్, అధ్యాపకుడు రాజశేఖర్ మాట్లాడుతూ ఈనెల 10 నుంచి కామర్స్ విద్యార్థులకు ఫైనాన్సియల్ అకౌంటింగ్‌పై 10 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.రజనీలత, ప్లేస్‌మెంట్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ అనిల్‌కుమార్, మెంటార్ పి.సాగర్ పాల్గొన్నారు.

గోడలపై విద్యార్థుల పెయింటింగ్స్



కాజీపేట అర్బన్ : మా స్కూల్‌లో మా పెయింటింగ్స్ అంటూ కాజీపేట మండలం కడిపికొండలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాల విద్యార్థులు శుక్రవారం పెయింటింగ్స్ వేశారు. పాఠశాల సుందరీకరణలో భాగంగా మొక్కలు నాటారు. అందమైన వివిధ రకాల సంస్కృతి సంప్రదాయాలను వ్యక్తపరుస్తు, ఆటాపాటలతో కూడిన పెయింటింగ్స్‌ను స్కూల్ గోడలపై విద్యార్థులు స్వయంగా వేస్తూ ఉత్సాహాన్ని కనబరిచారు.

మంచి అలవాట్లే ఉన్నత దశకు చేరుస్తాయి



మాట్లాడుతున్న దామోదర్

కాజీపేట : విద్యార్థులు మంచి అలవాట్లే వారి గోల్‌ను చేరుకునేలా చేయడమే కాకుండా ఉన్నత దశకు చేరుస్తాయని ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోదర్ అన్నారు. స్థానిక సేయింట్ ఆన్స్ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమంలో ముఖ్య వక్తగా ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాల సీనియర్ టీచర్ ఫాతిమా థామస్ అధ్యక్షత వహించిన సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హన్మకొండ కార్యదర్శి తేరాల యుగందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టులకు ప్రమాదబీమా అవసరం

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద



జర్నలిస్టులకు బీమా పత్రాలు అందజేస్తున్న వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద

వరంగల్: వర్కింగ్ జర్నలిస్టులందరికి ప్రమాద బీమా అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో వరంగల్ టీఎస్‌జేయూ యూనియన్ సభ్యులందరికీ రూ.5లక్షల ఉచిత ప్రమాద బీమా పత్రాలను ఆమె అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది జర్నలిస్టులు ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతుంటారని, అలాంటి సమయంలో ప్రమాద బీమా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంగౌడ్ నారగోని, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్‌కుమార్, సహాయ కార్యదర్శి రావుల నరేష్, జిల్లా అధ్యక్షుడు కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శి ఆవునూరి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి



కాలనీలో ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రదేశం

హసన్‌పర్తి : ప్రస్తుతం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న ప్రదేశం అనుకూలంగా లేదని సత్యసాయి కాలనీ–5 వాసులు తెలిపారు. ఈ మేరకు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని కాలనీ ప్రధాన కార్యదర్శి టీఆర్‌కే రెడ్డి కోరారు.

క్రైం కార్నర్

17 క్వింటాళ్ల రేషన్‌బియ్యం సీజ్

హసన్‌పర్తి: మండలంలోని మల్లారెడ్డిపల్లిలో సుమారు 17 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 16 క్వింటాళ్ల నూకలు, క్వింటా బియ్యాన్ని సీజ్ చేసిన్నట్లు ఎస్సై రవి తెలిపారు. విధుల్లో భాగంగా స్థానిక ఏఎస్సై మల్లికార్జున్ మల్లారెడ్డిపల్లిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా టాటా ఏస్‌ను తనిఖీ చేయగా రూ.12,500 రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఈ బియ్యాన్ని కమలాపూర్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది.

న్యూరాయపురలో 7 క్వింటాళ్లు

వరంగల్ క్రైం : ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంను హన్మకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూరాయపురలోని శివరాత్రి మల్లమ్మ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్నట్లు వచ్చిన సమాచారంతో తనిఖీ చేయగా బియ్యం దొరికినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన రూ.18,200 వేల విలువ గల 7 క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. మల్లమ్మను అరెస్టు చేసినట్లు తెలిపారు. దాడిలో ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, ఆర్ఎస్సై భానుప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం : ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను అక్రమంగా విక్రయిస్తున్న కిరాణా షాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి గుట్కాలను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లష్కర్ బజార్‌లోని ఎండీ.జహేద్ అలీ కిరాణం షాపుపై దాడి చేయగా రూ.13,260 వేల విలువ చేసే గుట్కాలు పట్టుకున్నట్లు తెలిపారు. గుట్కాలను, నిందితుడు ఎండీ జహేద్ అలీని తదుపరి చర్యల కోసం హనుమకొండ పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. దాడిలో ఇన్స్పెక్టర్ రంజిత్‌కుమార్, ఎస్సై వి.దిలీప్, పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక రమాబాయి



హసన్‌పర్తి : త్యాగానికి ప్రతీక రమాబాయి అని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. రమాబాయి 127వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని దేవన్నపేటలో రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చుంచు కృష్ణ, ఇసంపల్లి కిరణ్, మహేష్, సారయ్య, ఐలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో పండ్ల పంపిణీ

రామన్నపేట : అలయన్స్ క్లబ్ వరంగల్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ పెంట కుమార్ కుమారుడు రాజ్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం నగరంలోని లూయిస్ అంధుల పాఠశాలలో విద్యార్థుల నడుమ కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వరంగల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిప్ప వెంకటేశ్వర్లు, కమిటీ చైర్మన్ మంత్రి లింగమూర్తి, లింగమూర్తి వరంగల్ డిస్ట్రిక్ట్ మల్టీపుల్ కోఆర్డినేటర్ ఓంకార్ లింగం శాస్త్రి, జోనల్ చైర్మన్ దస్తగిరి, క్లబ్ అధ్యక్షులు నాగేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా 'వడ్లు ఓలుపు- రాముని పిలుపు '



రామన్నపేట : నగరంలోని కొత్తవాడలోని శ్రీ భాష్పాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం 'వడ్లు ఓలుపు -రాముని' పిలుపు కార్యక్రమం సంధ్యారాణి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి రోజున భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి కల్యాణంలో ఉపయోగించే తలంబ్రాల నిమిత్తం ప్రత్యేకంగా పండించిన వడ్లను గోటితో ఒలిచి కోటి గోటి తలంబ్రాల తయారీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, బస్వరాజు లక్ష్మి, బస్వరాజు సుజాత,మహిళలు పాల్గొన్నారు.